
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శనివారం । 5 । జూలై । 2025



సోమశిలలో 30.620 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో శుక్రవారం నాటికి 30.620 టీఎంసీలు ఉన్నాయి. పెన్నార్ డెల్టాకు 2,850, ఉత్తర, దక్షిణ కాలువలకు 1275 క్యూసెక్కుల వంతున విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.1,00,120
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.9,056
3 శాతం జీఎస్టీతో	రూ.9,328
నవర (8 గ్రా)	రూ.74,624

వాతావరణం

గరిష్టం/కనిష్టం 38.6 /28.0

జిల్లాలో శనివారం వాతావరణం పాక్షికంగా మేఘావృతంగా ఉండి, అక్కడక్కడ చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది. శుక్రవారం గాలిలో తేమ 46 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

ఖతార్‌లో ఉద్యోగావకాశాలు

నెల్లూరు (పొగతోట): ఐటీఐ, వెల్డర్స్ పూర్తి చేసిన నిరుద్యోగులకు ఖతార్ దేశంలో ఉద్యోగావకాశాలు అందుబాటులో ఉన్నాయని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి షేక్ అబ్దుల్ ఖయ్యూం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వెల్డర్ కోర్సు పూర్తి చేసి 24- 45 ఏళ్ల వయస్సు ఉన్న వారు ఉద్యోగానికి అర్హులన్నారు. ఐటీఐ, ఐటీసీ పూర్తి చేసి నాలుగేళ్ల అనుభవం ఉండాలన్నారు. టీఐజీ, ఏఆర్‌సీ, మల్టీ వెల్డర్ ఉద్యోగానికి ఎంపికైన వారికి రూ.52 వేల నుంచి రూ.61,500, వెల్డర్ ఉద్యోగానికి రూ.42,500 నుంచి రూ.52 వేలు వేతనం ఉంటుందన్నారు. రెండేళ్ల పాటు కాంట్రాక్ట్ కాలం ఉంటుందన్నారు. ఉచిత వసతి, భోజనం, వైద్య సదుపాయాలు, రవాణా సౌకర్యం, స్వదేశానికి ఒకసారి వచ్చి పోవడానికి సౌకర్యం కల్పించడం జరుగుతుందన్నారు. అవసరమైన పత్రాలు, పాస్‌పోర్టు, అనుభవానికి సంబంధించి ధ్రువపత్రాలతో ఈ నెల 25వ తేదీలోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. పూర్తి వివరాల కోసం 79896 13024 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

రేపట్నుంచి రొట్టెల పండగ

నెల్లూరు (బృందావనం): మతసామరస్యానికి ప్రతీకగా నిలిచే, కోరికలు నెరవేర్చే బారాషహీద్ దర్గా రొట్టెల పండగ ఆదివారం నుంచి 10వ తేదీ వరకు జరగనుంది. ఆదివారం రాత్రి సొందల్‌మాలి, జూలై 7న సోమవారం రాత్రి గంధమహోత్సవం, జూలై 8న మంగళవారం రొట్టెల పండగ, జూలై 9న బుధవారం తహలీల్ ఫాతేహా, జూలై 10న గురువారం ముగింపు వేడుకలు నిర్వహించనున్నారు.

హాజరు తేలేదెలా?

- సాంఘిక సంక్షేమ హాస్టళ్లల్లో పనిచేయని థంబ్ డివైస్‌లు
- వార్డెన్లనే కొనుక్కోమని మౌఖిక ఆదేశాలు
- పదేళ్ల కింద కొన్న కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లకు మరమ్మతులు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): సంక్షేమ హాస్టళ్లల్లో విద్యార్థులకు మౌలిక సౌకర్యాలు కొరవడితే.. చివరాఖరుకు విద్యార్థుల అటెండెన్స్‌కు సంబంధించి థంబ్ డివైస్‌లు పనిచేయడం లేదు. వాటిని మీరే కొనుక్కోవాలని సాంఘిక సంక్షేమశాఖ హాస్టల్ వార్డెన్లకు మౌఖిక ఆదేశాలు అందాయి. హాస్టల్ వార్డెన్లు థంబ్ డివైస్‌లు కొనుక్కోవాలంటే ఒక్కొక్కరు రూ.3,500 నుంచి రూ.5 వేలు వెచ్చించాల్సిన పరిస్థితి. అటెండెన్స్ లేకపోతే బిల్లుల్లో మళ్లీ ఇబ్బంది వస్తుందని సొంతంగా డబ్బులు ఖర్చు తెచ్చి పెడుతున్నారు. ఇదిలా ఉంటే హాస్టళ్లలోని ల్యాప్‌టాప్‌లు దాదాపు పదేళ్ల కిందట కొన్నవి కావడంతో ఏటా వాటి రిపేర్లు కూడా సొంతంగా పెట్టుకుంటున్నారని చెబుతున్నారు. ఈ విద్యా సంవత్సరంలో హాస్టళ్లు మళ్లీ తెరవడంతో అటెండెన్స్‌ను కచ్చితంగా చూపాల్సిన అవసరం ఏర్పడింది. ప్రతి రోజూ అటెండెన్స్ వేయాలంటే డివైస్‌లు తప్పని సరి కావడంతో వార్డెన్లు ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి నెల నెట్‌కు అయ్యే ఖర్చు కూడా వాళ్లే పెట్టాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బడ్జెట్ వస్తుంది

అటెండెన్స్ థంబ్ డివైస్‌లు కొనడానికి బడ్జెట్‌ను కేటాయించాం. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. త్వరలో సాంకేతిక సమస్యలను సైతం పరిష్కరిస్తాం.
– శోభారాణి, సాంఘిక సంక్షేమశాఖ డీడీ

వారెవ్వా.. వైద్యశాఖ

- తప్పు ఒకరిది.. శిక్ష మరొకరికి

నెల్లూరు(అర్బన్): వైద్యశాఖలో తప్పు ఒకరు చేస్తే శిక్ష మరొకరికి పడింది. ఏఎస్‌పేట పీహెచ్‌సీలో పనిచేస్తున్న ఎఫ్ఎన్ఓ దొరసానమ్మను జొన్నవాడకు బదిలీ చేస్తూ వైద్యశాఖ అధికారులు శుక్రవారం రాత్రి ఉత్తర్వులు సిద్ధం చేశారు. ఇటీవల కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సు లక్ష్మి తనను వేధిస్తోందంటూ ఎఫ్ఎన్ఓ దొరసానమ్మ నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. అయితే రెండో రోజు లక్ష్మి కూడా తనకు డాక్టర్లు సెలవులు ఇవ్వకుండా వేధిస్తున్నారంటూ తనపై జరిగిన విచారణలో దొరసానమ్మ తనకు వ్యతిరేకంగా స్టేట్‌మెంట్ ఇచ్చిందని చెబుతూ నిద్రమాత్రలు మింగింది. లక్ష్మి గతంలో పని చేసిన ప్రకాశం జిల్లా కనిగిరిలోనూ గొడవలే జరగడంతో ఆమెను ఏఎస్‌పేటకు పీహెచ్‌సీకి మార్చారు. ప్రస్తుత ఏఎస్‌పేట డాక్టర్లపై కూడా లక్ష్మి ఫిర్యాదులు చేయడంతో వివాదంగా మారింది. ఈ క్రమంలో జరిగిన విచారణలో ఎఫ్ఎన్ఓ డాక్టర్లకు అనుకూలంగా చెప్పడంతో, ఆ విషయాన్ని గోప్యంగా ఉంచాల్సిన వైద్యశాఖ అధికారులు ఎఫ్ఎన్ఓ ఇచ్చిన స్టేట్‌మెంట్‌ను లక్ష్మికి అందజేశారు. దీంతో లక్ష్మి ఎఫ్ఎన్ఓను టార్గెట్ చేసింది. ఉద్యోగం చేసుకుంటూనే ఎఫ్ఎన్ఓ దొరసానమ్మ జీఎన్ఎం కోర్సు చదువుతోందంటూ క్లాసులకు హాజరు కాకుండా పరీక్షలు ఎలా రాయనిస్తారంటూ లక్ష్మి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి ఎఫ్ఎన్ఓ ఆమెకు టీసీ ఇచ్చేలా చేసింది. ఆమె కెరీర్‌పై దెబ్బకొట్టింది. ఈ క్రమంలో లక్ష్మిని మర్రిపాడుకు బదిలీ చేసింది. డాక్టర్‌ను బదిలీ చేసింది. కేవలం విచారణలో తన అభిప్రాయాన్ని చెప్పిన ఎఫ్ఎన్ఓ దొరసానమ్మను జొన్నవాడకు బదిలీ చేసి శిక్షించారు.

డీల్ కుదిరింది!

అప్పుడు అక్రమం.. ఇప్పుడు సక్రమం



గత ప్రభుత్వ హయాంలో రియల్ వెంచర్ల వ్యాపారం ఊపందుకోవడంతో కొందరు నేతలు ఆ వ్యాపారంలో దిగారు. కావలి ఏరియాలో అయితే పెద్ద ఎత్తున వెంచర్లు ఏర్పాటయ్యాయి. వ్యవసాయ పొలాలన్నీ లేఅవుట్లుగా మారాయి. ఈ క్రమంలో పొలాల్లోని కాలువలు, బండ్ల బాటలు వెంచర్లలో కలిసిపోయాయి. అయితే స్థానికంగా ఏర్పాటైన లేఅవుట్లలో ఎక్కువ మంది వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు కావడంతో స్థానిక ఎమ్మెల్యేకు కంటగింపు అయింది. వెంచర్లలో ప్రభుత్వ భూములు కలిపేసుకున్నారంటూ నానా యాగీ చేశారు. అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే లేఅవుట్లను ధ్వంసం చేశారు. వెంచర్లలో ప్లాట్ల విక్రయాలపై ఆంక్షలు పెట్టడంతో వెంచర్ యజమానులు పచ్చ కండువాలు వేసుకుని కప్పం కట్టేయడంతో అంతా సక్రమైంది.

- గతంలో ప్రభుత్వ భూముల్లో లేఅవుట్లు వేశారంటూ ఎమ్మెల్యే హడావుడి
- 128 ఎకరాలు దురాక్రమణ చేశారంటూ ఆరోపణలు
- వైఎస్సార్‌సీపీ మద్దతుదారుల వలు లేఅవుట్లు ధ్వంసం
- పచ్చ కండువాలు కప్పుకుని కప్పం కట్టడంతో అంతా ఓకే
- ఎమ్మెల్యే డీల్‌ను వ్యతిరేకిస్తున్న ఎమ్మెల్సీ బీద?

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: కావలి నియోజకవర్గంలో గతంలో ప్రభుత్వ భూములు దురాక్రమణ చేసి లేఅవుట్‌లు వేసి సొమ్ము చేసుకున్నారని ఆరోపణలతో తెగ హడావుడి చేసిన ఎమ్మెల్యే కృష్ణారెడ్డి ఇప్పుడు మౌనం దాల్చారు. లేఅవుట్ యజమానులతో డీల్ కుదుర్చుకున్నట్లు ఇప్పుడు ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. పచ్చ కండువా కప్పుకోవడంతోపాటు కప్పం కట్టడంతో వెంచర్లలో ప్లాట్ల విక్రయాలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఈ పరిణామాలు అధికార పార్టీలోనే విభేదాలు రాజేస్తున్నాయి. ఎమ్మెల్సీ బీద రవిచంద్ర ఎమ్మెల్యే కృష్ణారెడ్డి తీరుపై రుసరుస లాడుతున్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది.

కూటమి రాగానే లేఅవుట్లపై కావ్య కన్నెర్ర

కూటమి ప్రభుత్వం ఏర్పాటుతోనే కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి గత ప్రభుత్వ హయాంలో పట్టా భూములతోపాటు ప్రభుత్వ భూములను కలిపేసుకుని వ్యాపారం చేసి బాగా ఆర్జించారంటూ ఆరోపణలు గుప్పించారు. రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులతో సర్వేలు చేయించారు. దాదాపు వెంచర్లలో 128 ఎకరాలు ప్రభుత్వ భూములు ఉన్నాయని మీడియా ముందు ప్రకటించారు. ఆ తర్వాత మున్సిపాలిటీ అధికారులతో పత్రికల్లో హెచ్చరిక నోటీసులు జారీ చేయించారు. ఆయా లేఅవుట్లలో ప్రభుత్వ భూములు ఉన్నాయని, అవి సక్రమంగా లేవంటూ ఇటువంటి ప్లాట్లు కొనద్దంటూ ప్రకటనలు వేయించారు. వెంచర్లలో యంత్రాలు పెట్టి రాళ్లను తొలగించారు. దీంతో ప్లాట్లు కొనుగోలు చేసిన వారు భయాందోళనకు గురయ్యారు. ఇవిగో ప్రభుత్వ భూములని సర్వే నంబర్లు లీకులు ఇచ్చారు. బిట్–1లో 1834లో 5 ఎకరాలు, 487లో 2.67 ఎకరాలు, 551లో 2 ఎకరాలు, 832లో 2.61 ఎకరాలు, 546లో 4.02, 354లో 10.70 ఎకరాలు చెరువులు ఆక్రమణలకు గురయ్యాయని, బిట్–2లో 1855లో 15 ఎకరాలు, 1834లో 0.29, 1310లో 5.50, 1562లో 1.88, 1846లో 7.97, 1593లో 0.87 302లో 8.64, కంచి రామగుంట, పులారుగుంటలో శ్మశాన స్థలం, కొనదిన్నె కాలనీలో 1.10 ఎకరాలు, వక్కిలగుంట పోరంబోకు భూములు ఆక్రమణలకు గురైనట్లు చెప్పుకొచ్చారే కానీ,ఏ లేఅవుట్‌లో ఎంత కలిసిందనే విషయాన్ని మాత్రం ఇంత వరకు బయట పెట్టలేదు.

సీన్ కట్ చేస్తే ..

కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది దాటినా కూడా సర్వే చేసిన నివేదిక బయటకు రాలేదు. ప్రభుత్వ భూములు స్వాధీనం చేసుకోలేదు. వెంచర్ల యజమానులు మాత్రం స్థానిక ఎమ్మెల్యేకు భజన చేయడం. పెద్ద హోర్డింగ్‌లు పెట్టించడం. గజమాలలతో సత్కరించడం చూస్తుంటే వారితో పెద్ద డీలే కుదిరిందని పుకార్లు షికార్లు చేస్తున్నాయి. భారీగానే చేతులు మారినట్లు ఆరోపణలు గుప్పుమంటున్నాయి.

విభేదిస్తున్న బీద

కావలిలో జరిగే రాజకీయ పరిణామాలు ఎమ్మెల్సీ బీద రవిచంద్రకు రుచించడం లేదు. గతంలో ప్రభుత్వ భూముల్లో వెంచర్లు వేసి దోచుకున్నారని ఆరోపణలు చేసి, ఆ వెంచర్లు వేసిన వారినే తిరిగి పార్టీలోకి ఆహ్వానించడంపై ఆయన రుసరుసలాడుతున్నట్లు అధికార పార్టీ నేతలే చెబుతున్నారు. అప్పుడంతా అక్రమం అరిచి గీ పెట్టి ఇప్పుడు అంతా సక్రమమేనని సర్దుబాటు చేసుకోవడం ఏమిటని ఆయన మండి పడుతున్నారని టీడీపీ నేతలు బహిరంగంగానే చెపుతున్నారు. మహేంద్ర, కేశవులనాయుడు, బాలమురళీరెడ్డి, కాటా శ్రీనివాసులురెడ్డి, సుకుమార్‌రెడ్డి వంటి వెంచర్ల వ్యాపారులు పచ్చ కండువాలు కప్పుకునేందుకు ముందుకు రాగా బీద కొర్రీ వేసినట్లు సమాచారం. వారికి పార్టీ కండువాలు కప్పకుండానే కార్యక్రమాలకు ఖర్చు చేయిస్తుండడం గమనార్హం. ఈ పరిణామాలు పార్టీలో తీవ్రస్థాయిలో విభేదాలు రాజేశాయి. బీద వర్సెస్ కావ్యా వార్ జరుగుతోంది. కావలిలో జరిగే పార్టీ కార్యక్రమాలకు సైతం బీద హాజరు కావడం లేదు.

ప్రభుత్వ భూముల నిగ్గు తేల్చాలంటున్న వైఎస్సార్‌సీపీ

గతంలో ప్రభుత్వ భూములు దురాక్రమణ చేశారంటూ తెగ ఆరోపణలు చేసిన ఎమ్మెల్యే ప్రస్తుతం మౌనం దాల్చడం వెనుక ఏం జరిగిందని వైఎస్సార్‌సీపీ మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి బహిరంగంగానే ప్రశ్నిస్తున్నారు. అధికారులతో సర్వే చేయించారు కదా. వెంటనే ఆయా భూములను స్వాధీనం చేసుకుని మీ చిత్తశుద్ధి నిరూపించుకోవాలని ఆయన డిమాండ్ చేస్తున్నారు. అలా జరగలేదంటే మీ మధ్య జరిగిన డీల్ బయట పెట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

జాతీయ లోక్ అదాలత్ నేడు

నెల్లూరు (లీగల్): జాతీయ లోక్ అదాలత్‌ను శనివారం నిర్వహించనున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి నెల్లూరు జిల్లా వ్యాప్తంగా కోవూరు, కావలి, ఆత్మకూరు, ఉదయగిరి, గూడూరు, కోట, నాయుడుపేట, సూళ్లూరుపేట, వెంకటగిరి కోర్టుల్లో కేసుల పరిష్కారనికి ప్రత్యేక బెంచ్‌లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. నెల్లూరు నగరంలోని కోర్టుల్లో ఆరు ప్రత్యేక బెంచ్‌లను ఏర్పాటు చేసి న్యాయమూర్తులను ప్రిసైడింగ్ అధికారులుగా ప్రత్యేకంగా నియమించినట్లు, సివిల్, క్రిమినల్, చెక్ బౌన్స్, బ్యాంకింగ్, మోటార్ వాహన ప్రమాదాలు, నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్, రాజీకి అనువైన కేసులను పరిష్కారించుకోవచ్చని, ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి తెలిపారు.

కాకాణి ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణ 9కి వాయిదా

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: కాకాణి గోవర్ధన్‌రెడ్డి ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణ ఈ నెల 9వ తేదీకి వాయిదా వేస్తూ గూడూరు ఏడో అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి నాగపవన్ శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చారు. ఎన్నికల సమయంలో విరువురులో అక్రమ మద్యం నిల్వ ఉంచారని పెంచలయ్యతోపాటు మరో ఏడుగురిపై పొదలకూరు ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు సీసీ నంబర్ 528/2024 కేసు నమోదు చేశారు. ఈ కేసు కోర్టులో చార్జిషీటు దాఖలై.. కోర్టు విచారణలో ఉంది. నిందితులు ఎనిమిది మంది కోర్టుకు హాజరవుతున్నారు. రాజకీయ వేధింపుల్లో భాగంగా తాజాగా కోర్టు అనుమతి మేరకు కేసును పునర్విచారణ పేరుతో మాజీమంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి, బచ్చు సురేష్‌రెడ్డిపై కేసు బనాయించాలని ప్రయత్నం చేస్తున్నారు. ఈ క్రమంలో కాకాణి గోవర్ధన్‌రెడ్డి, సురేష్‌రెడ్డి ముందస్తు బెయిల్ కోరుతూ తమ న్యాయవాది మలపాటి విజయకుమారి ద్వారా గూడూరు 7వ అదనపు జిల్లా కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. శుక్రవారం పిటిషన్ విచారణకు వచ్చింది. పోలీసులు తరఫున ఏపీపీ తమకు కొంత సమయం కావాలని కోరడంతో కాకాణి తరపు న్యాయవాది అభ్యంతరం తెలిపారు. కాకాణి పట్ల కక్ష పూరితంగా వ్యవహరిస్తూ కేసు విచారణ సాగ దీస్తున్నారని అభ్యతరం తెలిపారు. ఇరువైపులా వాదనలు విన్న న్యాయమూర్తి కేసు విచారణ ఈ నెల 9కు వాయిదా వేశారు.

ఆత్మాహుతికైనా సిద్ధమే..
భూములు మాత్రం ఇవ్వం



మా భూముల జోలికి రావొద్దని వేడుకొంటున్న రైతులు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తూమాటి

- తేల్చి చెప్పిన కరేడు గ్రామస్తులు
- బీడు భూములు కాకుండా.. పచ్చని భూములు తీసుకుంటారా?
- మూడు వేలకు పైగా అభ్యంతర అర్జీలు
- రైతులకు అండగా ఉంటాం: ఎమ్మెల్సీ తూమాటి

ఉలవపాడు: ఆత్మాహుతికైనా సిద్ధమే కానీ మా భూములు మాత్రం ఇవ్వమని మండలంలోని కరేడు రైతులు తేల్చి చెప్పారు. భూసేకరణపై ప్రజాభిప్రాయ సేకరణ గ్రామసభ శుక్రవారం కరేడులోని 1వ సచివాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా భూ సేకరణకు వ్యతిరేకంగా తమ అభిప్రాయాలు వెల్లడించడానికి సుమారు 4 వేల మంది రైతులు తరలివచ్చారు. మహిళలు పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ అధికారులను ఉక్కిరిబిక్కిరి చేశారు. అభివృద్ధి అంటే ఏమిటని రైతులు ప్రశ్నించారు. మెట్ట భూములు ఉపయోగంలోకి తేవడం అభివృద్ధి అంటారన్నారు. సస్యశ్యామలంగా ఉన్న భూములను తీసుకుంటే అభివృద్ధి ఎలా అవుతుందని, వ్యవసాయమే లేకుండా చేస్తారా అని నిలదీశారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయడానికి మా భూములివ్వాలా అని అధికారులను ప్రశ్నించారు. తాము మాత్రం భూములివ్వడానికి అంగీకరించమని తేల్చి చెప్పారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాజశేఖర్ మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం దృష్ట్యా భూ సేకరణ చేస్తున్నామన్నారు. రైతుల సమస్యలు 100 శాతం పరిష్కరించలేమని, కానీ వారికి అన్నీ అందించాలని కృతనిశ్చయంతో ఉన్నామన్నారు. సబ్ కలెక్టర్ శ్రీపూజ మాట్లాడుతూ రైతుల సహకారంతోనే భూ సేకరణ చేస్తామన్నారు. చివరకు ఎలాంటి తీర్మానం లేకుండానే సభను ముగించారు.

రైతులకు అన్యాయం జరిగితే ఊరుకునేది లేదు: ఎమ్మెల్సీ తూమాటి

కరేడు రైతులకు ఏ మాత్రం అన్యాయం జరిగినా ఊరుకునేది లేదని ఎమ్మెల్సీ తూమాటి మాధవ రావు హెచ్చరించారు. రైతుల అభిప్రాయాలను తీసుకోకుండా ఒక్క ఎకరా కూడా తీసుకోలేరన్నారు. కరేడు రైతులందరూ చిన్న, సన్న కారు రైతులు వారు కేవలం వ్యవసాయం మీద ఆధారపడి జీవించే వాళ్లు. వారికి అండగా ఉంటామన్నారు. కంపెనీలు 75 శాతం ఉద్యోగాలు ఇస్తామని చెప్తారు. కానీ ఎక్కడ ఇచ్చారో చూపాలన్నారు. రామాయపట్నం పోర్టు అరబిందో కంపెనీ కడుతుంటే ప్రభుత్వం మారగానే నవయుగకు అప్పగించారన్నారు. అక్కడి ఉద్యోగులను తొలగించారని, కంపెనీలు ఉద్యోగాల కల్పనను పాటించడం లేదన్నారు. భూ సేకరణ జరగాలంటే ప్రజలను సంతృప్తి పరచి చేయాలి. రైతులు తమ నిర్ణయాన్ని తెలియజేశారని, వారికి అండగా ఉంటామన్నారు. రాస్తా రోకోలో రైతులు తమ బాధను వెలిబుచ్చడానికి ఆందోళన చేస్తే వారిపై కేసులు పెట్టారని, వాటిని ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కరేడు గ్రామ వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో భూ సేకరణకు వ్యతిరేకంగా అర్జీ అందించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీఓ సురేష్‌తోపాటు సిబ్బంది పాల్గొన్నారు.



భారీగా హాజరైన రైతులు

పచ్చని భూములు గుంజుకోవడం అమానుషం

కందుకూరు: రైతుల నుంచి వేల ఎకరాల పచ్చని భూములను బలవంతంగా గుంజుకోవడం అనుమానుషమని కందుకూరు నియోజకవర్గ అభివృద్ధి మండలి అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దివి శివరాం, ఉపాధ్యక్షుడు పాలేటి కోటేశ్వరరావు, కన్వీనర్ తోకల వెంకటేశ్వర్లు ఖండించారు. శుక్రవారం వారు మాట్లాడుతూ ప్రభుత్వం బలవంతంగా 8,600 ఎకరాలకు నోటిఫికేషన్ ఇచ్చి మొదటి దశలో 4 వేల ఎకరాలను బలవంతంగా సేకరించడం దారుణమన్నారు. కరేడు గ్రామాన్ని సంపూర్ణంగా ఖాళీ చేయించడం కోసం స్పెషల్ పార్టీ పోలీసులను గ్రామాల్లో తిప్పిభూమిని ఇవ్వడానికి ఇష్టపడని రైతులను భయభ్రాంతులకు గురి చేసి భూమిని బలవంతంగా లాక్కోవడానికి ఇప్పుడు తీవ్ర ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. వాస్తవాన్ని పాలక పక్షం దాచడం అన్యాయమన్నారు.

ప్రభుత్వ ఉపాధ్యాయుడి పిల్లలకు 'తల్లికి వందనం'

- ఇద్దరు పిల్లలకు రూ.26 వేలు జమ

ఉదయగిరి: కూటమి ప్రభుత్వం 'తల్లికి వందనం' లీలలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. అర్హులైన ఎంతో మంది పిల్లల తల్లులకు 'తల్లికి వందనం' ఎగనామం పెట్టింది. కానీ ఒక ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడి పిల్లలకు 'తల్లికి వందనం' జమైంది. వరికుంటపాడు మండలం తిమ్మారెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీఎస్ (ఫిజికల్ సైన్స్) టీచర్‌గా పని చేసే రవి సతీమణి ఖాతాలో తమ ఇద్దరు పిల్లలకు సంబంధించి 'తల్లికి వందనం' రూ.26 నగదు జమైంది. వీరి పిల్లలు ఇద్దరు వింజమూరులోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఎలిమెంటరీ సెక్షన్‌లో 1, 4 తరగతులు చదువుతున్నారు. అయితే భవిష్యత్‌లో సమస్య వచ్చే అవకాశం ఉండడంతో ఈ విషయం తెలుపుతూ తన భార్య ఖాతాలో జమ అయిన నగదును వెనక్కి ఇచ్చేందుకు అభ్యంతరం లేదంటూ లిఖిత పూర్వకంగా వింజమూరు ఎంఈఓ కార్యాలయంలో లేఖను అందజేశారు. ఈ మొత్తాన్ని ఏ విధంగా రికవరీ చేసి, ఏ ఖాతాలో జమ చేయాలో అర్థం కాక విద్యాశాఖాధికారులు కిందామీద పడుతున్నారు. అయితే ఈ విషయం తెలిసిన స్థానికులు అసలైన అర్హులకు ఇవ్వకుండా.. ఇలా ఇష్టారీతిన జమ చేసిందని విమర్శిస్తున్నారు. ఏడాది కాలంగా విద్యార్థులకు సంబంధించి అర్హులైన లబ్ధిదారుల జాబితాలను సిద్ధం చేస్తున్నామంటూ చెప్పిన మాటలన్నీ ఉత్తుత్తివే అని తేటతెల్లమవుతోంది. వైఎస్సార్‌సీపీ సూపర్ సిక్స్ పథకాలపై ఉద్యమాలు చేస్తుండడంతోపాటు ఇటీవల కూటమి ప్రభుత్వం ఏడాది పాలనపై ప్రతిపక్షం చేపట్టిన నిరసన కార్యక్రమానికి అనూహ్య స్పందన రావడంతో హడావుడిగా ఆయా ఖాతాల్లో జమ చేశారని, అందు వల్లే ఇలాంటి పొరపాట్లు జరిగాయని స్పష్టమవుతోంది.

క్లుప్తంగా

స్థల వివాదంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై దాడి



చికిత్స పొందుతున్న బాధితురాలు

ఆత్మకూరు: చేజర్ల మండలం తూర్పుకంభం పాడు గ్రామంలో స్థల వివాదంలో వైఎస్సార్‌సీపీ మహిళా కార్యకర్త కృష్ణవేణిపై టీడీపీ కార్యకర్తలు దాడికి పాల్పడ్డారు. బాధితుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన పంచేటి కృష్ణవేణికి ఆమె బంధువువైన టీడీపీ కార్యకర్త కృష్ణయ్యకు మధ్య స్థల వివాదం ఉంది. ఈ నేపథ్యంలో శుక్రవారం తహసీల్దార్ బి.మురళి గ్రామానికి వెళ్లాడు. కృష్ణవేణి పొజిషన్ సర్టిఫికెట్ రద్దు చేస్తున్నామని, కృష్ణయ్యకు దారికి స్థలం ఇవ్వాలని చెప్పాడు. దీనిపై కృష్ణవేణి అభ్యంతరం వ్యక్తం చేశారు. కోర్టులో ఈ అంశం ఉందన్నారు. రెండు నెలల క్రితం కోర్టు కమిషనర్ వచ్చి స్థలం పరిశీలించారని, ఇంకా తీర్పు వెలువడలేదన్నారు. ఈ సమయంలో దారి ఎలా ఇవ్వమంటారంటూ తహసీల్దార్‌ను ప్రశ్నించారు. అయితే తహసీల్దార్ ఆదేశాలతో సర్వేయర్, వీఆర్వోలు స్థలం కొలతలు వేసి కర్రలు నాటాలని ప్రయత్నించగా కృష్ణవేణి, ఆమె బంధువులు ప్రశ్నించారు. కృష్ణయ్య, అతని బంధువులు కృష్ణవేణిపై దాడికి పాల్పడ్డారు. దీంతో అధికారులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. బాధితురాలు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లగా సిబ్బంది లేరని తొలుత ఫిర్యాదు తీసుకోలేదు. ఫోన్‌లో ఎస్సై తిరుమలేశ్వరరావును సంప్రదించిన అనంతరం ఫిర్యాదు అందజేసి బాధితురాలిని ఆత్మకూరులోని ప్రభుత్వ వైద్యశాలకు చికిత్స కోసం బంధువులు తరలించారు. ఈ విషయమై తహసీల్దార్ స్పందిస్తూ అప్పట్లో ఇచ్చిన పొజిషన్ సర్టిఫికెట్ సర్వే నంబర్ తప్పు అని, అందుకే దానిని రద్దు చేస్తానన్నారు. కాగా కృష్ణయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కృష్ణవేణిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఆమె ఇచ్చిన ఫిర్యాదు పరిగణలోకి తీసుకోలేదన్నారు.

అప్పుల బాధ తాళలేక..

- పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

నెల్లూరు సిటీ: అప్పుల బాధ తాళలేక ఓ వ్యక్తి పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం మేరకు.. రూరల్ పరిధిలోని కలివెలపాళెంలో నివాసముంటున్న చాంద్‌బాషా (43) బేల్దారి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతడికి భార్య, ఒక కుమారుడు ఉన్నారు. ఇటీవల అప్పులు చేశాడు. ఆర్థిక సమస్యలతో వాటిని తీర్చలేకపోయాడు. గురువారం రాత్రి మామిడితోటలో చాంద్‌బాషా పురుగు మందు తాగి ఇంటికెళ్లాడు. కుటుంబ సభ్యులు గుర్తించి అతడిని హాస్పిటల్‌కు తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి	: రూ.25
సన్నవి	: రూ.15
పండ్లు	: రూ.5

ఇష్టారాజ్యంగా బదిలీలు

సాంఘిక సంక్షేమ శాఖలో ఇదీ పరిస్థితి

- కౌన్సెలింగ్ లేదు
- అయోమయంలో సంక్షేమ విద్యా సహాయకులు
- వివరాలు తెలుసుకోవడానికి కార్యాలయానికి రాక
- పట్టించుకోని ఉన్నతాధికారులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): సంక్షేమ విద్యా సహాయకుల బదిలీల ప్రక్రియ గందరగోళంగా మారింది. ఏమి జరుగుతుందో ఎవరికీ తెలియని పరిస్థితి నెలకొంది. జిల్లాలో 500 మందికి పైగా ఉన్న సహాయకుల్లో ఎవరిని ఎక్కడికి మార్చారో తెలియడం లేదు. బదిలీల ప్రక్రియ గత నెల 30వ తేదీకి పూర్తి కావాల్సి ఉంది. అయితే ఆ శాఖలోని అధికారులు, సిబ్బంది ఆఫీస్‌లో లేకపోవడంతో వివరాలు తెలియక ఉద్యోగులు దూర ప్రాంతాల నుంచి నెల్లూరుకు వచ్చి కార్యాలయంలో వేచి చూడటం పరిపాటిగా మారింది. నాలుగు రోజులుగా ఇదే పరిస్థితి ఉంది.

సిఫార్సు లేఖల వల్లే..

సాంఘిక సంక్షేమ శాఖ డీడీ, సీనియర్ అసిస్టెంట్లు కార్యాలయంలో లేకపోవడంతో ఏం జరుగుతుందో ఉద్యోగులకు తెలియడం లేదు. గ్రామ, వార్డు సచివాలయ శాఖ ఇప్పటికే వివిధ శాఖలకు అందించిన సీనియారిటీ జాబితా ప్రకారం బదిలీల కౌన్సెలింగ్ ప్రక్రియ జరగాల్సి ఉంది. ఏఎస్‌డబ్ల్యూ పరిధిలో అందరి ఉద్యోగుల దగ్గర ఆప్షన్ ఫారం ఇచ్చి మూడు సచివాలయాలు ఎంపిక చేసుకోవాలని, దాని సీనియారిటీ ప్రకారం బదిలీ చేస్తామని చెప్పారని ఉద్యోగులు అంటున్నారు. అయితే కూటమికి ప్రజాప్రతినిధులు ఇచ్చిన సిఫార్సు లేఖలకు ప్రాధాన్యం ఇచ్చినట్లు తెలిసింది. లెటర్లు లేకపోతే ఎక్కడికైనా బదిలీలు చేస్తామని అధికారులు ఫోన్ చేసి తెలుపుతున్నారని ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



సమాచారం తెలుసుకోవడానికి వచ్చిన ఉద్యోగులు

మనోవేదనకు..

బదిలీల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాల్సి ఉంది. అయితే ఆ శాఖలోని కొందరు అధికారుల చేష్టల వల్ల సంక్షేమ విద్యా సహాయకులు తీవ్ర మనోవేదనకు గురవుతన్నారు. ఎవరికి ఏ ప్రాంతానికి బదిలీ జరుగుతుందోనని తెలియని పరిస్థితి ఉంది. ముఖ్యంగా దివ్యాంగులు, అనారోగ్య కారణాలున్నవారు, ఒంటరి మహిళలు, స్పౌజ్ కేటగిరీ విషయంలో నిబంధనలను పాటించడం లేదని విమర్శలున్నాయి. ఐదేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న వారికి నిబంధనల ప్రకారం బదిలీలు నిర్వహించడం లేదని చెబుతున్నారు. ఇప్పటికే సొంత మండలాల్లో స్థానం కోల్పోయామని తెలిసిన వారు ఏ ప్రభుత్వ ఉద్యోగులకైనా ఇలా చేస్తారా? అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వేరే చోటుకు వెళ్లండి

బదిలీకి దరఖాస్తు చేసుకున్న కొంతమంది ఉద్యోగులకు ఆ శాఖ సిబ్బంది ఫోన్‌లు చేసి మీరు పెట్టుకున్న ప్లేస్ ఖాళీగా లేదు. వేరే చోటుకు బదిలీ చేస్తామని చెబుతున్నారని ఆరోపణలున్నాయి. అసలు బదిలీల ప్రక్రియలో ఉద్యోగులను ఏమీ అడగకుండా సంబంధిత శాఖాధికారులు కార్యాలయంలో అందుబాటులో ఉండటం లేకపోవడం విమర్శలకు తావిస్తోంది. మొత్తం బదిలీల ప్రక్రియ వ్యవహారాన్ని గోప్యంగా ఉంచడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చాలామంది గత నెల 30వ తేదీ నుంచి జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. అయితే వారికి ఎవరూ వివరాలు అందించడం లేదు. అధికారులకు ఫోన్ చేస్తే సరైన సమాధానం ఉండటం లేదు.

నిబంధనల ప్రకారమే నిర్వహించాం

ప్రభుత్వ నిబంధనల ప్రకారమే బదిలీలు నిర్వహించాం. బదిలీలు అయిపోయినట్టే. ఆ జాబితాను కలెక్టర్‌కు అందజేశాం. ఆఫీసులో కరెంట్ లేకపోవడం వల్ల కొండాయపాళెం గేటు వద్ద అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ కార్యాలయంలో జాబితాను రూపొందించాం. మేము ఎవరికీ ఫోన్ చేయలేదు.

– శోభారాణి, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ

రైలు కింద పడి వ్యక్తి బలవన్మరణం



మృతదేహం

నెల్లూరు(క్రైమ్): ఏం కష్టమొచ్చిందో తెలియదు గానీ కేరళ ఎక్స్‌ప్రెస్ రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి బలవన్మరణం చెందాడు. ఈ ఘటన శుక్రవారం డీమార్ట్ సమీపంలో నెల్లూరు వైపు వెళ్లే రైలు పట్టాలపై చోటుచేసుకుంది. ప్రమాద ఘటనపై సమాచారం అందుకున్న నెల్లూరు రైల్వే ఎస్సై ఎన్.హరిచందన ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. అతని వయసు సుమా 35 నుంచి 40 ఏళ్ల లోపు ఉండొచ్చని భావిస్తున్నారు. బిస్కెట్, బ్లాక్ కలర్స్ గల ఫుల్‌హ్యాండ్స్ చొక్కా, బ్లూ కలర్ జీన్స్ ప్యాంట్ ధరించి ఉన్నాడు. కుడిచేతిపై ఎస్‌ఎల్‌టీ అక్షరాలు, ఎడమ ఛాతిపై ఎస్ అనే అక్షరం పచ్చబొట్టు ఉంది. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి ఎస్సై కేసు నమోదు చేశారు. మృతుడి వివరాలు తెలిసిన వారు నెల్లూరు రైల్వే పోలీసులను సంప్రదించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

కండలేరులో 32.326 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో శుక్రవారం నాటికి 32.326 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ గజేంద్ర రెడ్డి తెలిపారు. సత్యసాయి గంగ కాలువకు 2,080, పిన్నేరు కాలువకు 10, లోలెవల్ కాలువకు 70, హైలెవల్ కాలువకు 70, మొదటి బ్రాంచ్ కాలువకు 85 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.

గంజాయి అక్రమ రవాణాపై దాడులు

- 4 కేజీల స్వాధీనం

నెల్లూరు(క్రైమ్): గంజాయి అక్రమంగా తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. శుక్రవారం నెల్లూరు రైల్వే డీఎస్పీ జి.మురళీధర్, రైల్వే సీఐ ఎ.సుధాకర్‌తో కలిసి తన కార్యాలయంలో తనిఖీల వివరాలను వెల్లడించారు. గురువారం సాయంత్రం సీఐ పర్యవేక్షణలో రైల్వే, ఆర్పీఎఫ్ అధికారులు తమ సిబ్బందితో కలిసి నెల్లూరు ప్రధాన రైల్వేస్టేషన్‌లో తనిఖీలు చేపట్టారు. టాటానగర్ – ఎర్నాకుళం ఎక్స్‌ప్రెస్ రైలు దిగి నాలుగో నంబర్ ప్లాట్‌ఫారానికి వెళ్తున్న పశ్చిమబెంగాల్ రాష్ట్రానికి చెందిన బిష్ణు షబ్బర్, పదహారేళ్ల బాలుడిని అదుపులోకి తీసుకున్నారు. వారిద్దరి బ్యాగ్‌ల్లో ఉన్న రూ.80 వేల విలువైన 4 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులు ఒడిశా, ఏఓబీ సరిహద్దుల్లో గంజాయిని కొనుగోలు చేసి చెన్నై తదితర ప్రాంతాల్లో అధిక ధరలకు విక్రయిస్తున్నారని డీఎస్పీ వెల్లడించారు. కేసులో ప్రతిభ చూపిన సీఐతోపాటు ఎస్సై ఎన్.హరిచందన, సిబ్బంది రవి, వెంకటేశ్వర్లు, మణికంఠ తదితరులను డీఎస్పీ అభినందించారు.



వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ మురళీధర్

వెయ్యి మొబైల్ ఫోన్ల రికవరీ

- ఎనిమిది విడతల్లో బాధితులకు 3,900 ఫోన్ల అందజేత
- ఎస్పీ కృష్ణకాంత్

నెల్లూరు(క్రైమ్): వివిధ కారణాలతో ప్రజలు పోగొట్టుకున్న సుమారు రూ.2 కోట్ల విలువైన 1,000 మొబైల్ ఫోన్లను పోలీస్ అధికారులు రికవరీ చేశారు. శుక్రవారం నెల్లూరులోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో ఎస్పీ కృష్ణకాంత్ చేతుల మీదుగా ఫోన్లను బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. మొబైల్ హంట్ ద్వారా ఎనిమిది విడతల్లో రూ.4 కోట్ల విలువైన 3,900 ఫోన్లు, సీఈఐఆర్ ద్వారా రూ.6 లక్షల విలువైన 60 మొబైల్ ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందించామన్నారు. మొబైల్ హంట్ (91543 05600)తోపాటు సీఈఐఆర్ సేవలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని ఎవరైనా తప్పుడు పద్ధతిలో వినియోగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఫోన్లను గుర్తించి అప్పగించిన ఎస్పీ, సైబర్ క్రైమ్ పోలీసులకు బాధితులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్పీ సీహెచ్ సౌజన్య, నెల్లూరు నగర డీఎస్పీ పి.సింధుప్రియ, సైబర్ క్రైమ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



బాధితుడికి ఫోన్ అందజేస్తున్న ఎస్పీ కృష్ణకాంత్

కలెక్టర్ పేరుపై నకిలీ ఫేస్‌బుక్ ఐడీ

నెల్లూరు(క్రైమ్): కలెక్టర్ పేరుతో నకిలీ ఫేస్‌బుక్ ఐడీ క్రియేట్ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని సీసీ కె.శ్రావణ్‌కుమార్ శుక్రవారం దర్గామిట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈనెల రెండో తేదీన గుర్తుతెలియని వ్యక్తులు ఐడీ క్రియేట్ చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దర్గామిట్ట ఇన్‌స్పెక్టర్ రోశయ్య కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పేరు ఒకరిది.. నిర్వహణ మరొకరిది

- పొదుపు మహిళకు చౌకదుకాణం కేటాయింపు
- కానీ నిర్వహిస్తోంది అసోసియేషన్ నాయకుడు
- 6ఏ కేసు నమోదు చేసిన అధికారులు

నెల్లూరు(పొగతోట): పొదుపు మహిళకు కేటాయించిన చౌకదుకాణాన్ని డీలర్ల అసోసియేషన్ నాయకుడు నిర్వహిస్తున్న వైనం వెలుగు చూసింది. దీంతో అధికారులు 6ఏ నమోదు చేసి షాపును సీజ్ చేశారు. దీనికి సంబంధించి వివరాలిలా ఉన్నాయి. నెల్లూరు నగరంలో 50వ నంబర్ చౌకదుకాణం డీలర్ కొన్ని సంవత్సరాల క్రితం మరణించాడు. దానిని పొదుపు మహిళకు అప్పగించారు. అయితే అసోసియేషన్ నాయకుడు సదరు షాపును బినామీ పేరుతో నిర్వహిస్తున్నాడు. ఈ విషయంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందాయి. దీంతో డీఎస్‌ఓ విజయ్‌కుమార్, ఏఎస్‌ఓ అంకయ్య రంగంలోకి దిగారు. రెండు రోజుల క్రితం అంకయ్య ఆ చౌకదుకాణానికి వెళ్లి వివరాలు సేకరించారు. పొదుపు మహిళ కాకుండా మరొకరు ఉండటంతో ప్రశ్నించారు. థంబ్ వేసి ఆమె వెళ్లిపోయిందని అతను సమాధానం చెప్పాడు. పిలిపించమని అధికారులు వేచి ఉన్నా ఎంతకూ రాలేదు. చివరికి ఆమెకు ఆరోగ్యం బాగోలేక ఆస్పత్రిలో జాయిన్ అయ్యిందంటూ డొంక తిరుగుడు సమాధానం చెప్పాడు. మరుసటిరోజు డీఎస్‌ఓ దుకాణానికి వెళ్లారు. థంబ్ ఎవరు వేశారంటే పొదుపు మహిళ అని సమాధానం వచ్చింది. ఆమెను పిలిపించాలని చెప్పారు. ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ వచ్చింది. ఆమె రావడానికి కొన్ని రోజులు పడుతుందని చెప్పారు. దీంతో అధికారులు బినామీ డీలర్‌గా గుర్తించి థంబ్ ఎవరు వేస్తున్నారో అర్థం కాక 6ఏ కేసు నమోదు చేశారు. దుకాణాన్ని మరొకరికి కేటాయించాలంటూ నెల్లూరు ఆర్డీఓకు రాతపూర్వకంగా సమాచారం అందచేశారు. ఆ అసోసియేషన్ నాయకుడికి సుమారు 8 చౌక దుకాణాలున్నట్లు సమాచారం.

కాంట్రాక్టర్లకు స్వర్ణాల వర్షం



ప్రాంగణంలో పోసిన మట్టి



గుర్రపు డెక్కను తొలగిస్తున్న యంత్రం

- అవసరానికి మించి అంచనాలకు రూపకల్పన
- నగరపాలక సంస్థ సాధారణ నిధుల కేటాయింపు
- రొట్టెల పండగలో ఇదీ తంతు

నెల్లూరు(బారకాసు): ఎంతో ప్రఖ్యాతి గాంచిన రొట్టెల పండగకు దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు భారీగా విచ్చేస్తారు. వీరికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిధులను కార్పొరేషన్ జనరల్ ఫండ్స్ నుంచి వెచ్చిస్తారు. కార్యక్రమం జరిగిన కొద్ది రోజుల పాటు స్వర్ణాల చెరువుపై దృష్టి పెట్టి ఆపై విస్మరిస్తారు. అయితే ఈ పండగ వచ్చిందంటే కాంట్రాక్టర్లకు మాత్రం స్వర్ణాల వర్షం కురుస్తుంది.

శాశ్వత పనులా.. అబ్బే

బారాషహీద్ దర్గా ప్రాంగణంలో చేపట్టే వివిధ రకాల తాత్కాలిక పనులకే రూ.కోట్లు వెచ్చిస్తున్నారు. ఈ మొత్తంతో శాశ్వత పనులు చేపట్టే అవకాశం ఉన్నా, ఆ దిశగా అధికార పార్టీ నేతలు పట్టించుకోవడంలేదు. వారి నేతలకు సంబంధించిన కాంట్రాక్టర్లకు దోచిపెట్టేందుకు అవసరానికి మించి అంచనాలను రూపొందించి వర్క్స్ చేపడుతున్నారు. మరోవైపు కార్యక్రమ నిర్వహణకు కార్పొరేషన్ రూ.3.77 కోట్ల మేర అంచనాలను రూపొందించింది. అయితే ఇందులో దాదాపు 50 శాతం కంటే ఎక్కువ ఖర్చు కాకపోవచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

తాము కోరిన కోర్కెలను నెరవేర్చే రొట్టెల పండగ అంటే ఎంతో మందికి మహా ఇష్టం. ఏటా బారాషహీద్ దర్గాలోని స్వర్ణాల చెరువు వద్దకు పోటెత్తి రొట్టెలను మార్పిడి చేసుకుంటూ ఉత్సాహంగా గడుపుతారు. అయితే ఇక్కడ పరిస్థితి ఎలా ఉన్నా, కాంట్రాక్టర్లకు మాత్రం కాసుల వర్షం కురుస్తూనే ఉంది. తాజాగా అవసరానికి మించి అంచనాలను రూపొందించారు. వివిధ రకాల తాత్కాలిక పనులకే కోట్లాది రూపాయలను వెచ్చిస్తున్నారంటే ఇక్కడ జరుగుతున్న కథాకమామీషు ఏమిటో అర్థం చేసుకోవచ్చు.

అంచనాలిలా..	(రూ.లక్షల్లో)
షామియానాలు	82.10
తాగునీటి సరఫరా	37.68
సివిల్ వర్క్స్	41.45
మొబైల్ టాయ్‌లెట్స్ సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్	62.45
సీసీ కెమెరాలు, డ్రోన్లు సాంకేతిక పరికరాల ఏర్పాటు	25.33
శానిటేషన్	74
లైటింగ్	54.75
మొత్తం	3.77 కోట్లు

అంతా హడావుడి

- స్వర్ణాల చెరువు ఘాట్ ఏర్పాటుకు సివిల్ వర్క్స్‌ను చేపడతారు. అయితే వీటిని ఆర్నెల్ల ముందు నిర్వహిస్తే, రొట్టెల పండగ నాటికి గట్టితనం ఏర్పడి ఎలాంటి ఇబ్బంది లేకుండా ఉంటుంది. అయితే కార్యక్రమానికి పది రోజుల ముందు హడావుడిగా ప్రారంభించి తూతూమంత్రంగా నిర్వహిస్తున్నారు. భక్తుల తాకిడికి ఘాట్ మరమ్మతులకు గురికావడం, గ్రానైట్స్ లేచిపోవడమనేది ఏటా జరిగేదే. అదేదో ముందే చేపడితే ఇలాంటి పరిస్థితికి ఆస్కారం ఉండదు.
- తాగునీటి కోసం రూ.లక్షలను ఖర్చు చేస్తుంటారు. అదే దర్గా ప్రాంగణంలో పైపులైన్‌ను నిర్మించి పలు ప్రదేశాల్లో కుళాయి.. ట్యాంక్‌ను ఏర్పాటు చేసే దిశగా చొరవ చూపడంలేదు. శాశ్వత మరుగుదొడ్లను నిర్మించి అందులో నీరొచ్చేలా చూస్తే ఇంత నిధులను వెచ్చించాల్సిన అవసరం ఉండదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రజాధనం దుర్వినియోగం కాకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.